'రాష్ట్రంలో గాడితప్పిన ప్రజాపాలన'

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, నాయకులు

అశ్వాపురం, డిసెంబర్ 10: రాష్ట్రంలో ప్రజాపాలన గాడి తప్పిందని, కాంగ్రెస్ నాయకులకు పరిపాలన మీద కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోడి అమరేందర్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ మండల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నాడు బీఆర్ఎస్ పాలనలో మంజూరైన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాల్సిన కాంగ్రెస్ నాయకులు కొన్ని పనులను రద్దు చేయించడమే కాకుండా ఎన్నికల కోడ్ వల్ల అర్థాంతరంగా మధ్యలో ఆగిపోయిన పనులను కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మర్రి మల్లారెడ్డి, కొల్లు మల్లారెడ్డి, కంచుగట్ల వీరభద్రం, జాలె రామకృష్ణారెడ్డి, ఈదర సత్యనారాయణ, కందుల కృష్ణార్జునరావు, సూదిరెడ్డి గోపిరెడ్డి, వెన్న అశోక్ కుమార్, నేలపట్ల సత్యనారాయణరెడ్డి, నక్కనబోయిన పాపారావు, చుంచు రామ్మూర్తి, గద్దల రామకృష్ణ, కంసాని సత్యనారాయణ, శివరాపు డాక్టర్‌బాబు, నజీర్ సోను, షేక్ నయీమ్ పాల్గొన్నారు.

ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్‌స్టేషన్లు : డీపీవో

మాట్లాడుతున్న డీపీవో చంద్రమౌళి

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి తెలిపారు. మంగళవారం ఐడీవోసీలో గ్రామాల్లో పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటు, ప్రచురణ, ఎన్నికల నియమావళిపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. డీఆర్‌డీవో విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి హాజరయ్యారు. డీపీవో మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల ప్రక్రియకు జిల్లాలో చేపట్టబోతున్న ఏర్పాట్లను పార్టీల నాయకులకు వివరించారు. గ్రామాల పరిధిలోని ఓటర్ల జాబితాల ఆధారంగా పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో గౌని నాగేశ్వరరావు, సంకుబాపన అనుదీప్, అన్నవరపు సత్యనారాయణ, మల్లికార్జున్ రావు, బీజేపీ నుంచి నోముల రమేష్, కాంగ్రెస్ నుంచి లక్ష్మణ అగర్వాల్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

టేకులపల్లి, డిసెంబర్ 10: కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో స్థానిక సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ దినేష్ వైద్యశిబిరం నిర్వహించారు. మంగళవారం కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరంలో పిల్లలను పరీక్షించి అవసరమైన వారికి రక్తపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు చలికాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్ఎం అమర్‌సింగ్, వార్డెన్ నాగేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారి దేవ, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్స్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఆటలు ఆడాలి

ఇల్లెందు, డిసెంబర్ 10: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి సెల్‌ఫోన్ వాడకం పక్కనపెట్టి చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇల్లెందు సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో సీఎం కప్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ నేర్పిస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

బూర్గంపహాడ్, డిసెంబర్ 10: మండల పరిధిలోని ఎంపీపీఎస్ అంజనాపురం, సందెళ్లరామాపురం, ఎంపీయూపీఎస్ లక్ష్మీపురం పాఠశాలలను సీఎంవో సైదులు, ప్లానింగ్ మానిటరింగ్ అధికారి సతీష్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలను పరిశీలించి అంజనాపురంలో కిచెన్ గార్డెన్‌ను సందర్శించారు. మెడికల్ ప్లాంట్‌లను చూసి ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో యదు సింహరాజు, హెచ్ఎంలు తేజావత్ కిషన్‌రావు, బి.మాన్‌సింగ్, ఉపాధ్యాయులు తేజావత్ బాబూరావు, శంకర్, తేజావత్ మోహన్, ఎస్.సునీత పాల్గొన్నారు.

సెంట్రల్ వర్క్‌షాప్‌లో రక్షణ పక్షోత్సవాలు

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 10 : సింగరేణి కార్పొరేట్ ఏరియా సెంట్రల్ వర్క్‌షాప్‌లో రక్షణ పక్షోత్సవాలను మంగళవారం నిర్వహించారు. 55వ రక్షణ పక్షోత్సవాల సందర్భంగా కన్వీనర్, జీఎం ఫిజరాల్డ్, తనిఖీ బృందం వారిని జీఎం దామోదర్‌రావు, డీజీఎం రత్నప్రకాష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు.

సింగరేణి డే వేడుకల నిర్వహణపై సమీక్ష

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 10 : సింగరేణి ప్రధాన కార్యాలయం క్యాంటీన్‌లో మంగళవారం కార్పొరేట్ పరిధిలోని అధికారులతో ఈ నెల 23వ తేదీన జరిగే సింగరేణి డే వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై జీఎం శ్రీనివాసరావు చర్చించారు. ప్రకాశం స్టేడియంలో ఏర్పాటు చేయబోయే స్టాల్స్, ఇతర ఏర్పాట్ల గురించి డిపార్ట్‌మెంట్లవారీగా చర్చించి పలు సూచనలు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED
★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338976-AII

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

CHANGE OF NAME
I, AMGOTH DURGA (OLD NAME) D/o. Amgoth Mohan, R/O. H.No.3-31/1, Bikku Thanda Village, Palvoncha Mandal, Bhadradri Kothagudem District, Telangana, Hereby changed my name as ANGOTH DURGA (NEW NAME) D/O.ANGOTH MOHAN. HENCE FORTH, I SHALL BE CALLED AS ANGOTH DURGA for all purposes.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

కాంగ్రెస్ తల్లి వద్దు.. తెలంగాణ తల్లి ముద్దు

ఇల్లెందు పట్టణంలో ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

పాల్వంచ పట్టణంలో క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చండ్రుగొండ : తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, ఉద్యమకారులు

దమ్మపేట : పట్వారిగూడెంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పినపాక : అనంతారంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మణుగూరు టౌన్ : తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

దుమ్ముగూడెం : తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చర్ల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో.. తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం

భద్రాచలం : తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం 'తెలంగాణ తల్లి' విగ్రహ స్వరూపాన్ని మార్చడంపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. కాంగ్రెస్ తల్లిని పోలిన విధంగా ఉండే ఆ విగ్రహాన్ని రాష్ట్ర సచివాలయం ఎదుట ప్రతిష్ఠించడాన్ని వ్యతిరేకిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు నిరసనలు చేపట్టారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి క్షీరాభిషేకాలు చేశారు. కాంగ్రెస్ తల్లి వద్దు.. తెలంగాణ తల్లి ముద్దు అంటూ నినాదాలు మార్మోగాయి. ఈ సందర్భంగా అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ తల్లిగా మార్చేశారని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ తల్లిని గౌరవంగా గాంధీభవన్‌కు పంపి తీరుతామని స్పష్టం చేశారు. కొత్తగూడెం పట్టణంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం కాదని, చేతనైతే ఆరు గ్యారెంటీలను అమలు చేసి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి చర్యలు మానుకోకపోతే పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. ఇల్లెందు పట్టణంలో తెలంగాణ ఉద్యమనేత, సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూసి ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని, అలాంటి విగ్రహానికి రూపురేఖలు మార్చి నిరంకుశంగా కాంగ్రెస్ పాలన నిర్వహిస్తుందని అన్నారు.

– నమస్తే నెట్‌వర్క్

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

జూలూరుపాడు, డిసెంబర్ 10 : మండల కేంద్రంలోని సాయి ఎక్స్‌లెంట్ పాఠశాల 27వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రోడ్లు, భవనాలు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, సాయి ఎక్స్‌లెంట్ స్కూల్ వ్యవస్థాపకుడు గొల్లమండల రమేష్, హెచ్ఎం శారద ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కొత్తగూడెం డివిజన్ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ సెక్రటరీ విశ్వశాంతి, ప్రిన్సిపాల్ నరసింహారావు, డైరెక్టర్ హుస్సేన్, కరస్పాండెంట్ కృష్ణ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల స్థాయి సీఎం కప్ క్రీడలు ప్రారంభం

చుంచుపల్లి : జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన జట్టు

దుమ్ముగూడెం, డిసెంబర్ 10: మండల స్థాయి సీఎం కప్–2024 క్రీడా పోటీలను ఎంఈవో సున్నం సమ్మయ్య మంగళవారం మండలంలోని ములకపాడు క్రీడాప్రాంగణంలో ప్రారంభించారు. ఈ నెల 11వ తేదీ వరకు క్రీడాపోటీలు జరుగుతాయని, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాలలకు చెందిన పీడీ, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూలూరుపాడు, డిసెంబర్ 10 : మండల కేంద్రం జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభమయ్యాయి. మండల ప్రత్యేక అధికారి రుక్మిణీదేవి, ఎంపీడీవో, ఎంఈవోలు పాల్గొని ప్రారంభించారు. క్రీడలు ప్రతి మనిషికి ఆరోగ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని, ఐకమత్యాన్ని, దేశ గౌరవాన్ని పెంచుతాయన్నారు. ఈ నెల 16, 17, 18, 19 తేదీల్లో జరిగే పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 10 : సుజాతనగర్ మండల స్థాయి సీఎం కప్ పోటీలను ఈ నెల 11వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి పోటీలు జరుగుతాయని, విజయవంతం చేయాలని కోరారు.

టేకులపల్లి, డిసెంబర్ 10 : టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడలు జోరుగా సాగాయి. మంగళవారం పాఠశాలల క్రీడా పోటీల్లో భాగంగా టేకులపల్లి మండల ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ నాగభవాని ఎంపీడీవో రవీంద్రరావుతో కలిసి సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్రరావు, ఎంపీవో గణేష్‌గాంధీ, ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

చుంచుపల్లి, డిసెంబర్ 10 : స్థానిక ధన్బాద్ పంచాయతీ సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం సీఎం కప్ 2024 మండల స్థాయి ఆటల పోటీలు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో అశోక్‌కుమార్, తహసీల్దార్ కృష్ణ, ఎంఈవో బాలాజీ, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, పీడీలు, పోటీదారులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాధుల స్థలం కోసం వినతి

పాల్వంచ, డిసెంబర్ 10 : పాల్వంచ మండల క్రైస్తవులకు సమాధుల స్థలం కేటాయించాలని కోరుతూ మంగళవారం పాల్వంచ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే కూనంనేని ద్వారా జిల్లా నాయకుడు సాబీర్‌పాషా ఆధ్వర్యంలో పాస్టర్లు తహసీల్దార్‌ను కలిశారు. స్థలం ఏర్పాటుకు పరిశీలిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు, లారీ పట్టివేత

పాల్వంచ, డిసెంబర్ 10: మున్సిపాలిటీలోని గుడిపాడు వద్ద ఉన్న మొర్రేడువాగు నుంచి మంగళవారం తెల్లవారుజామున అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లు, ఒక లారీని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. మొర్రేడువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం మేరకు పట్టణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్‌రెడ్డి, హచ్చాలు దాడి చేసి పట్టుకున్నారు. తోగ్గూడెంలో ఇసుక లారీని పట్టుకొని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

రామవరం, డిసెంబర్ 10: 2024–25 సంవత్సరానికి దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలు, యూనివర్సిటీల్లో మెడిసిన్, ఇంజినీరింగ్, డిప్లొమా, ఐటీఐలలో విద్యనభ్యసిస్తున్న వారు ఎల్ఐసీ అందిస్తున్న గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈత పోటీల్లో ఛత్రపతినాథ్‌కు రజితం

రామవరం, డిసెంబర్ 10 : ధన్బాద్ పంచాయతీలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న చత్రపతినాథ్ భూపాలపల్లిలో ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన తెలంగాణ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించాడు. 50 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో పతకం సాధించడంతో ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

నేడు ఉపాధిహామీ పనులపై చర్చ

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 10: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పథకం పనులపై బహిరంగ చర్చావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. నవంబర్ 11వ తేదీ నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. వీటిపై మండల చర్చ నిర్వహించనున్నామని, అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదులు చేయాలని సూచించారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

చుంచుపల్లి, డిసెంబర్ 10 : మండలంలోని బాబూక్యాంపు ఏరియాలో మంగళవారం తెల్లవారుజామున ఇంటిముందు పనిచేస్తున్న పద్మ అనే మహిళ మెడలోని రెండు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. తెల్లవారుజామున సుమారు 4:30 ప్రాంతంలో బ్లాక్ మాస్కు ధరించి స్కూటీపై వచ్చి మెడలోని చైన్ ఒక్కసారిగా లాక్కొని ఉడాయించాడని బాధితురాలు తెలిపింది. సీసీ పుటేజీ పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

15న బాక్సింగ్ జట్టు ఎంపికలు

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 10: తెలంగాణ బాక్సింగ్ సమాఖ్య సబ్ జూనియర్ బాలబాలికల కోసం ఈ నెల 20, 21 తేదీల్లో, ఎలైట్ పురుషుల కోసం ఈ నెల 22, 23 తేదీల్లో హైదరాబాద్‌లో ఇంటర్ డిస్ట్రిక్ట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తోంది. వీటిని దృష్టిలో ఉంచుకొని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల జట్టు ఎంపికలను ఈ నెల 15వ తేదీన ఉదయం 8 గంటలకు స్థానిక ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఎల్లయ్య యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం కోచ్ సత్యబాబు–9299903203 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి

అశ్వారావుపేట, డిసెంబర్ 10: దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని షెడ్యూల్ కులాల హక్కుల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దళితుల సమస్యలపై మంగళవారం ఆయన స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద శిబిరంలో దరఖాస్తులను స్వీకరించారు. తహసీల్దార్ పి.కృష్ణప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

26 నుంచి నెహ్రూ కప్ క్రికెట్ పోటీలు

భద్రాచలం, డిసెంబర్ 10: భద్రాచలంలో 29వ నెహ్రూ కప్ అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నట్లు నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమళ్ల బాలియోగి, వాతాడి దుర్గా అశోక్ తెలిపారు. భద్రాచలంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు నెహ్రూ కప్ షెడ్యూల్ విడుదల చేశారు. ఆసక్తి కలిగిన క్రికెట్ జట్లు డిసెంబర్ 20వ తేదీలోగా తమ ఎంట్రీలు కన్వీనర్ ఎస్‌కె.సలీమ్, అబ్బాస్ ఫుట్‌వేర్, క్రికెట్ గ్రౌండ్ ఎదురుగా భద్రాచలం, సెల్:9440101108 చిరునామాకు పంపించాలని కోరారు.

సింగరేణి జీఎంకు సన్మానం

టేకులపల్లి, డిసెంబర్ 10 : కోయగూడెం ఉపరితల గనికి వచ్చిన సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఈసం క్రిష్ణయ్య, కేవోసీ పీవోల గోవిందరావును బీఆర్ఎస్ నాయకులు బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు సన్మానించారు. మంగళవారం కేవోసీకి వచ్చిన జీఎంను కలిశారు.

పుస్తకాలు అందజేత

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 10 : సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్ అనేక పుస్తకాలను సింగరేణి విద్యా సంస్థల లైబ్రరీలకు, పేద విద్యార్థులకు అందించారు. తన వద్ద ఉన్న పుస్తకాలను ఎస్ఎస్‌సీ వరకు, ఒక కేటగిరిగా విభజించి అనేక ఒలంపియాడ్ పుస్తకాలు, అట్లాస్, నిఘంటువులు, తెలుగు, సింగరేణి హైస్కూల్ హెచ్ఎం సాయిసుజాత, మ్యాథ్స్, ఒలింపియాడ్ సమన్వయ కర్త పూల్‌సింగ్, టీచర్ ప్రసన్నకు అందించారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, డిసెంబర్ 10: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం సీతారాములకు అర్చకులు నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

మోరంపల్లిబంజర్ సెక్రటరీకి సన్మానం

మోరంపల్లిబంజర్ సెక్రటరీని సత్కరిస్తున్న డీఆర్‌డీవో విద్యాచందన

బూర్గంపహాడ్, డిసెంబర్ 10: అంతర్జాతీయ మరుగుదొడ్డి దినోత్సవం పురస్కరించుకుని నవంబర్ 19 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాల ముగింపు సభ ఐడీవోసీలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సామూహిక మరుగుదొడ్ల నిర్వహణలో మోరంపల్లిబంజర్ పంచాయతీ గెలుపొందడంతో పంచాయతీ కార్యదర్శి భవానీని డీఆర్‌డీవో విద్యాచందన శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

పినపాక, డిసెంబర్ 10: ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఈ బయ్యారం సబ్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. ఆయన మంగళవారం ఈ బయ్యారం క్రాస్‌రోడ్‌లో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటూ తమ వాహనాలకు సంబంధించి అన్ని ధృవపత్రాలు కలిగి ఉండాలని అన్నారు. ఆటో డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి ఆటోలు నడపరాదని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు ప్రమాదాలకు గురైన వ్యక్తులను ఆపద సమయాల్లో ఆసుపత్రులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

బూర్గంపహాడ్, డిసెంబర్ 10: క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళకు బూర్గంపహాడ్ మండలం సారపాకలో 'ఒక హృదయం' స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మిట్టకంటి సంజీవరెడ్డి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఖమ్మం జిల్లా పెద్దతండాకు చెందిన లావుడియా మారోని క్యాన్సర్‌తో బాధపడుతోంది. గ్రామపెద్ద ధరావత్ సైదులు ఈ విషయాన్ని ఒక హృదయం స్వచ్ఛంద సంస్థ దృష్టికి తీసుకురావడంతో సంస్థ నిర్వాహకులు మిట్టకంటి సంజీవరెడ్డి మంగళవారం బాధితురాలికి సాయం అందజేశారు.

జైలు వార్డెన్‌గా భద్రాద్రి వాసి

భద్రాచలం, డిసెంబర్ 10: భద్రాచలం పట్టణంలోని జగదీష్‌కాలనీకి చెందిన కొరకాసుల సాంబశివరావు భద్రాచలం జైల్‌వార్డెన్‌గా నియామకమయ్యాడు. 2022 కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో అర్హత సాధించి హైదరాబాద్ చంచలగూడలో శిక్షణ పొంది ప్రిసన్ టెక్నాలజీలో బంగారుపతకం సాధించి భద్రాచలం జైలువార్డెన్‌గా నియామకం పొందారు. పుట్టిన ఊర్లోనే జైలు వార్డెన్‌గా ఉద్యోగం సాధించి విధుల్లో చేరబోతుండడంతో స్థానికులు, పట్టణ ప్రముఖులు సాంబశివరావును అభినందిస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 10 : క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతోపాటు శారీరక ధారుఢ్యం చేకూరుతుందని తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, ఎంపీడీవో మహాలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. యువత క్రీడల్లో రాణించాలని, క్రీడల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పేట కాంప్లెక్స్‌లో కథకేళి

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 10 : అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల విద్యార్థులతో కథకేళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు హరిత మాట్లాడుతూ విద్యార్థులు, పెద్దలకు కథలు సంక్లిష్ట ప్రపంచాన్ని సందర్భోచితంగా చేయడానికి సహాయపడతాయన్నారు. న్యాయనిర్ణేతలుగా రమేష్, బాబూరావు వ్యవహరించారు.

విద్యుత్ నియంత్రికల ఏర్పాటు

భద్రాచలం, డిసెంబర్ 10: పట్టణంలోని శాంతినగర్ కాలనీ, కూనవరం రోడ్ ఏరియాలో లోవోల్టేజీ సమస్య నివారణకు విద్యుత్‌శాఖ అధికారులు రెండు విద్యుత్ నియంత్రికలను ఏర్పాటు చేశారు. రూ.10లక్షలతో శాంతినగర్‌లో ఒకటి, కూనవరం రోడ్డులో రూ.5లక్షలతో రెండు నియంత్రికలను ఏర్పాటు చేయగా వాటిని భద్రాచలం ట్రాన్స్‌కో డీఈ జీవన్‌కుమార్, ఏడీఈ వేణు ప్రారంభించారు. ఏఈ రాజారావు, సీనియర్ లైన్ ఇన్స్‌స్పెక్టర్ జగ్గయ్య, శ్రీనివాస్, లైన్‌మెన్ త్రినాథ్‌రెడ్డి, జేఎల్ఎం జగదీష్, కాలనీవాసులు గాదె తులసీదాస్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ఎన్నిక

పాల్వంచ, డిసెంబర్ 10: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా 5వ మహాసభలో నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. పాల్వంచ మండలం దంతెలబోర ప్రాథమికోన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మల్లెంపాటి వెంకటేశ్వర్లు జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తోగ్గూడెం ప్రాథమిక పాఠశాలలో హిందీ టీచర్ షేక్ యాకూబ్ పాషాను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

స్కార్ఫ్ ఆవిష్కరణ

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 10 : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి విభాగంలో పనిచేసి పదవీ విరమణ చేసిన వారందరితో కలిసి ఈ నెల 15వ తేదీన కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లోని సింగరేణి చిల్డ్రన్ పార్కులో ఉన్న బీఎస్‌జీ సింగరేణి హెడ్ క్వార్టర్స్‌లో జరిగే అలయ్ బలాయ్ కార్యక్రమానికి సంబంధించిన స్కార్ఫ్‌ను మంగళవారం ఆవిష్కరించారు. చిల్డ్రన్స్ పార్కులో రిటైర్డ్ జీఎం, బీఎస్‌జీ మాజీ సింగరేణి జిల్లా కమిషనర్లు ఆనందరావు, కే.బసవయ్య ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆవిష్కరణ చేశారు. సింగరేణి రిటైర్డ్ అధికారి పచ్చా రామకృష్ణారావు నేతృత్వంలో ఈ అలయ్ బలాయ్ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.రాజారావు, బీమయ్య, గాజుల శ్రీనివాస్, మహ్మద్ ఖాసీం, హేమావతి పాల్గొన్నారు.

సరిహద్దుల్లో కారు దగ్ధం

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 10: ఆంధ్ర–తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ఏజెన్సీ ప్రాంతంలో ఓ కారు దగ్ధమైన ఘటన మంగళవారం కలకలం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని సరివెళ్ల గ్రామం వైపు నుంచి భద్రాచలం రహదారిలో వస్తున్న కారు అనుమానాస్పద స్థితిలో దగ్ధమైంది. దీనిపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే కారు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయిందా? ఎవరైనా దుశ్చర్యకు పాల్పడి ఉంటారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'రాజ్యాంగాన్ని కాపాడుకుందాం'

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 10 : రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం వచ్చిందని పలువురు వక్తలు స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మాల మహానాడు సింహగర్జన విజయోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకృతి ఆశ్రమంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన మాలల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జనకు జిల్లావ్యాప్తంగా అధిక సంఖ్యలో కదిలివచ్చి, విజయవంతం చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.